నమస్తే తెలంగాణ

# వికారాబాద్

13 హైదరాబాద్, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | VIKARABAD


## సీఎం పర్యటన వాయిదా

కొడంగల్, ఫిబ్రవరి 3 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన తాత్కాలికంగా వాయిదా పడినట్లు 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 5న కొడంగల్‌లో పర్యటించాల్సి ఉండగా.. ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నందున వాయిదా పడిందని, త్వరలోనే సీఎం పర్యటన తేదీని ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

## 9 నుంచి బుక్ ఫెయిర్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బుక్ ఫెయిర్(36వ జాతీయ పుస్తక ప్రదర్శన)ను ఈ నెల 9 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సారి బుక్ ఫెయిర్ ప్రాంగణానికి విప్లవ కవి, గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ పేరును పెట్టినట్టు తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా కొలువుదీరబోతున్న బుక్ ఫెయిర్‌లో 365 స్టాల్స్ ఉండబోతున్నాయి. తెలుగు సాహిత్యానికి సంబంధించి 184 స్టాల్స్, ఆంగ్ల సాహిత్యానికి 144 స్టాల్స్, పిల్లల కోసం 18 స్టాల్స్, ప్రభుత్వం సమాచార స్టాల్స్ 7, మీడియా రంగ సంస్థలు–15 స్టాల్స్‌తో పాటు ఇతర స్టాల్స్ ఉంటాయని హెచ్‌బీఎఫ్ సెక్రటరీ ఆర్. శ్రీనివాస్ తెలిపారు.

## అవిశ్వాస తీర్మానంపై 16న సమావేశం

### రిటర్నింగ్ అధికారిగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో

### నోటీసులు జారీచేసిన కలెక్టర్ శశాంక




ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 16న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 16 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ.. గత నెల 8న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లందరూ హాజరు కావాలని కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిని ప్రత్యేకాధికారిగా నియమించారు. అవిశ్వాస తీర్మానంతో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ రాజకీయం రసవత్తరంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దించేందుకు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరలేపగా.. మరోవైపు తన పదవిని కాపాడుకోవటం కోసం చైర్‌పర్సన్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.




## సంపూర్ణ ఆరోగ్యానికి ఒక్క మాత్ర

- నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి సన్నద్ధం
- 1 నుంచి 19 ఏండ్లలోపువారికి అందజేతకు చర్యలు
- జిల్లావ్యాప్తంగా 8,09,357 మంది ఉన్నట్లు గుర్తింపు
- ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

రంగారెడ్డి, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ) : పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. 1 నుంచి 19 ఏండ్లలోపు వారికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీకి కార్యాచరణను రూపొందించింది. ఈ నెల 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలను పంపిణీ చేయనున్నారు. దీనిపై ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతోపాటు అవసరమైన మాత్రలను అందుబాటులో ఉంచారు.

**జిల్లాలో 8,09,357 మంది గుర్తింపు..**

1 నుంచి 19 ఏండ్లలోపువారు జిల్లాలో మొత్తం 8,09,357 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో ప్రతి ఒక్కరూ మాత్రలు వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని విద్యార్థులకు మాత్రలు వేయనున్నారు. మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లాలోని 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, 406 మంది ఏఎన్ఎంలు, 1,368 మంది ఆశ వర్కర్లు, ఇతర సూపర్‌వైజర్లు పాలుపంచుకోనున్నారు. 9 లక్షల అల్బెండజోల్ మాత్రలను అందుబాటులో ఉంచారు.

### ఏడాదిలో రెండుసార్లు మాత్రల పంపిణీ



నులి పురుగులతో పోషకాహార లోపం వల్ల రక్తహీనత, కడుపు నొప్పి వంటి అనారోగ్య లక్షణాలు ఏర్పడి పిల్లలు చదువులో వెనుకబడిపోతున్నారు. నులి పురుగుల నివారణకు ఏడాదిలో రెండుసార్లు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నాం. మాత్రలను మింగిన తర్వాత వికారం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఇవి కొద్దిరోజుల్లోనే తగ్గిపోతాయి. కాబట్టి ఆందోళన చెందవద్దు. అత్యవసరమైతే 108 సేవలను వినియోగించుకోవాలి.

**- డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డీఎంహెచ్‌వో, రంగారెడ్డి జిల్లా**

## సాగు లెక్క పక్కా..

- క్షేత్రస్థాయిలో పంటల వివరాలు సేకరిస్తున్న వ్యవసాయశాఖ
- వివరాలు ఉంటేనే ఐకేపీ, సీసీఐ, మార్క్‌ఫెడ్, పీఏసీఎస్‌ల ద్వారా పంటల కొనుగోలు
- రైతుల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- రైతులు తమ పంటల వివరాలు ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని సూచిస్తున్న అధికారులు



షాబాద్, ఫిబ్రవరి 3 : రైతులు పండించిన పంటను మార్కెట్‌లో ఇబ్బందులు లేకుండా అమ్ముకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నది. గ్రామాల్లో ఏ రైతు, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట వేశాడో అనే వివరాల సేకరణకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టింది. రైతుల పంటల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నది. ఈ యాసంగి సీజన్‌లో రంగారెడ్డి జిల్లాలో 99,306 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 29,466 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఈ నెల చివరి వరకు వరితో పాటు ఇతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవోలు) ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటల సాగు వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వీటి ఆధారంగానే రానున్న రోజుల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

***5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్***

జిల్లావ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు(కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని 23 మండలాల్లో ఈ ఏడాది యాసంగి సీజన్‌కుగాను 99,306 ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 29,466 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో వరి 13,111 ఎకరాల్లో సాగు చేయగా, మరో 11,360 ఎకరాలకు సంబంధించిన నారు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నది. జొన్న 551, మొక్కజొన్న 1596, వేరుశనగ 6113, పొద్దుతిరుగుడు 264, కుసుమపువ్వు 2165, ఆముదం 118, ఇతర పంటలు 1725 ఎకరాల్లో సాగు చేయగా, 3851 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటల్లో ఇప్పటివరకు 20,888 ఎకరాల పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా 83 మంది ఏఈవోలు ప్రతి గ్రామంలో పంటల సాగు వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా విభజించి, ఆ పరిధిలో పంటల సాగు వివరాల సేకరణ బాధ్యత ఏఈవోలకు అప్పగించారు. ప్రస్తుతం జిల్లాలో పంటల సాగు లెక్కల సేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నది.

***ఈ నెల చివరి వరకు పంటల సాగు సేకరణ***

రైతులు సాగు చేసిన పంటల వివరాలను సేకరించిన ఏఈవోలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 20,888 ఎకరాల పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రైతుల ఫోన్ నంబర్‌లు కూడా నమోదు చేస్తున్నారు. ప్రతి గుంటలో సాగు చేసిన పంటల పూర్తి వివరాలు అధికారులు పకడ్బందీగా సేకరిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో ఏ ఊరిలో, ఏ రైతు, ఏ పంట, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో తెలిసిపోతుంది. ఈ నెల చివరి వరకు పంటల సాగు సేకరణ వివరాలు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

***వివరాలు ఉంటేనే పంటలు కొనుగోలు***

రైతులు పండించిన పంటలను ఇబ్బందులు లేకుండా మార్కెట్‌లో అమ్ముకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతు ఆ పంటను అమ్ముకోవాలంటే ఎలాంటి కష్టాలు ఉండకూడదనే లక్ష్యంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల సాగు వివరాల సేకరణ చేపడుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు నమోదు చేస్తున్న లెక్కల్లో వివరాలు ఉంటేనే పంటలను కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదైన పంటల వివరాల ప్రకారమే ఆయా రైతుల పంటల దిగుబడుల కొనుగోలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనున్నది. ఎఫ్‌సీఐ, మార్క్‌ఫెడ్, ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా రైతుల నుంచి వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటల దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. ఆన్‌లైన్‌లో వివరాలు లేని రైతుల నుంచి పంటల దిగుబడుల కొనుగోలును నిరాకరించే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తాము సాగుచేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

### జిల్లాలో పకడ్బందీగా పంటల నమోదు



జిల్లాలో పంటల సాగు వివరాల సేకరణ కార్యక్రమం పకడ్బందీగా కొనసాగుతున్నది. యాసంగిలో రైతులు సాగుచేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం సేకరించిన వివరాల ఆధారంగానే పంటల ఉత్పత్తులు మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 99,306 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 29,466 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఈ నెల చివరి వరకు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉన్నది. ఏఈవోలు గ్రామాల్లో పర్యటించి రైతుల పంటల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 20,888 ఎకరాల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో జరుగుతున్న పంటల వివరాల సేకరణను ఎప్పటికప్పుడూ పరిశీలిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పంటల వివరాలు ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలి.

**- గీతారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి**

## యాసంగి జోరు

- వికారాబాద్ జిల్లాలో జోరందుకున్న పంటల సాగు
- ఇప్పటివరకు 45,532 ఎకరాల్లో ఆయా పంటలు సాగు
- అత్యధికంగా 13,444 ఎకరాల్లో సాగైన వేరుశనగ
- కొనసాగుతున్న వరి నాట్ల పనులు
- జిల్లావ్యాప్తంగా 9942 ఎకరాల్లో వరి సాగు

వికారాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ఆయా పంటల సాగు జోరందుకున్నది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 45,532 ఎకరాల్లో ఆయా పంటలను రైతులు సాగు చేశారు. అత్యధికంగా వేరుశనగను సాగు చేయగా.. అత్యల్పంగా చెరుకును సాగు చేశారు. వరి నాట్లు వేసే ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా ఆయా పంటల విస్తీర్ణం మరింత పెరిగే అవకాశమున్నది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 9942 ఎకరాల్లో వరి పంటను జిల్లా రైతాంగం సాగు చేసింది. ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసేందుకు అనుకూలం దృష్ట్యా జిల్లాలో వరి సాగు 40 వేల ఎకరాల వరకు పెరిగే అవకాశమున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. 6675 ఎకరాల్లో జొన్న, 4340 ఎకరాల్లో మొక్కజొన్న, 221 ఎకరాల్లో చెరుకు, 13,444 ఎకరాల్లో వేరుశనగ, 2551 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 5628 ఎకరాల్లో శనగ, 1201 ఎకరాల్లో కందులు, 92 ఎకరాల్లో బఠాణీ, 1439 ఎకరాల్లో ఇతర పంటలు సాగయ్యాయి. ఆయా పంటల సాగుకు సంబంధించి వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. మరోవైపు జిల్లా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సరిపోను ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తున్నారు.

**40 వేల ఎకరాల వరకు వరి సాగయ్యే అవకాశం**

జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌కు సంబంధించి వరి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నది. ఇప్పటివరకు 9942 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసే అవకాశం ఉన్న దృష్ట్యా 40 వేల ఎకరాలకు వరి సాగు పెరుగనున్నది.

**30 వేల ఎకరాల వరకు ఆన్‌లైన్ పూర్తి**

యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ గత రెండేండ్ల నుంచి కొనసాగుతున్నది. కొనుగోలు విషయంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యటిస్తూ రైతులవారీగా సర్వే నంబర్, సాగు విస్తీర్ణంతోపాటు చేసిన పంట, విత్తన రకం, ప్రధాన పంట, అంతర పంట, నీటి వసతి వివరాలతోపాటు రైతుల సంతకాలను సేకరిస్తున్నారు. భూమి యజమాని ఫోన్ నంబర్ తదితర వివరాలను మరో యూనిట్‌గా తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పంటల వివరాల సేకరణలో భాగంగా నీటి ఆధారాలైన బోర్లు, బావులు, చెరువుల వివరాలను, రైతులు సాగు చేస్తున్న పంటల ద్వారా రానున్న దిగుబడి వివరాలను కూడా అంచనా వేస్తున్నారు.

**వరి సాగు ఇలా..**

| మండలం | ఎకరాలు |
| --- | --- |
| బొంరాస్‌పేట్ | 1555 |
| యాలాల | 1467 |
| దోమ | 1020 |
| దౌల్తాబాద్ | 920 |
| తాండూరు | 910 |
| ధారూరు | 952 |
| కులకచర్ల | 655 |
| పరిగి | 642 |
| పెద్దేముల్ | 530 |
| కొడంగల్ | 545 |
| చౌడాపూర్ | 435 |
| పూడూరు | 85 |
| వికారాబాద్ | 71 |
| మోమిన్‌పేట్ | 21 |
| నవాబుపేట్ | 8 |



### పంటల వివరాలు ఆన్‌లైన్‌లో..



యాసంగి సీజన్‌కు సంబంధించి వరి నాట్లు కొనసాగుతున్నాయి. ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసుకునేందుకు అనుకూలం. జిల్లాలో వరి 40 వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశముంది. రైతులు సాగు చేసే ఆయా పంటల వివరాలను క్షేత్రస్థాయిలోని వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**- గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి**



నకిలీ లిక్కర్‌ను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

## దో మాల్.. ధమాల్

### 3 వేల లీటర్ల నకిలీ లిక్కర్ ధ్వంసం

### కేసు విచారణ పూర్తికావడంతో నిర్ణయం

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 3 : మూడు వేల లీటర్ల నకిలీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.రవీందర్‌రావు సమక్షంలో హయత్‌నగర్ సీఐ టీ లక్ష్మణ్‌గౌడ్, ఇబ్రహీంపట్నం సీఐ టీ శ్రీనివాస్ రెడ్డి కలిసి శనివారం పెద్దఅంబర్‌పేటలో 358 కార్టన్ల నకిలీ మద్యాన్ని జేసీబీ సాయంతో పగులగొట్టారు. రంగారెడ్డి జిల్లాలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసును ఎక్సైజ్ పోలీసులు ఛేదించారు. దాదాపు ఏడాది కిందట ఒడిశాలోని కటక్ అభయారణ్యంలో ఏర్పాటు చేసిన అనుమతిలేని చట్ట విరుద్ధమైన మద్యం తయారీ పరిశ్రమను ధ్వంసం చేసి రూ.8 కోట్ల ఆర్థిక నష్టాన్ని కలిగించారు. అక్కడ లభించిన 358 కేసుల నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ ముగిసిన అనంతరం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నకిలీ మద్యాన్ని ధ్వంసం చేశారు. ప్రాథమిక రసాయన పరీక్షల అనంతరం, ఇది తాగేందుకు హానికరమైనదిగా భావించి ధ్వంసం చేసేందుకు అధికారులు ఆదేశాలు జారీచేశారు. మరోవైపు, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 35 బస్తాల (1050 కిలోల) నల్లబెల్లాన్ని గౌరెల్లి వద్ద మూసీ నదిలో పారబోశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ టీ సత్యనారాయణ, ఎస్సైలు యాదయ్య, వెంకన్న, హనుమంతు, సరళ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలి

### వికారాబాద్ డీఈవో రేణుకాదేవి

పరిగి, ఫిబ్రవరి 3 : పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి సూచించారు. శనివారం పరిగిలోని మండల పరిషత్ కార్యాలయంలో పరిగి, దోమ, పూడూరు, కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రేణుకాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు అదనపు తరగతులు, స్లిప్ టెస్ట్‌లు నిర్వహించి వారి అభ్యాసన స్థాయిని అంచనా వేసి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు తగు సూచనలు చేస్తూ వారు ముందంజ వేసేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పదోతరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులను అడిగి విద్యార్థుల చదువు స్థాయిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలాల విద్యాధికారులు హరిశ్చంద్ర, హబీబ్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

## కాంగ్రెస్ నుంచి మర్రి నిరంజన్‌రెడ్డి సస్పెండ్

ఆదిబట్ల, ఫిబ్రవరి 3 : ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరుడు మర్రి నిరంజన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సొంత పార్టీ, మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తీకపై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లతో క్యాంపు రాజకీయాలు చేస్తున్నారన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 9న అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించగా.. ఇప్పటికే కాంగ్రెస్ కౌన్సిలర్లను క్యాంపులకు తరలించారు. వారిపైనా క్రమశిక్షణా చర్యలు ఉంటాయని, త్వరలోనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని డీసీసీ, డీసీఏలు పేర్కొన్నారు.

**9న చైర్‌పర్సన్ పై అవిశ్వాసం..**

ఈ నెల 9న ఆదిబట్ల మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. చైర్‌పర్సన్ కొత్త ఆర్తీక, వైస్ చైర్మన్ కోరే కళమ్మపై అవిశ్వాసం పెట్టాలని ఇదివరకే కౌన్సిలర్లు కలెక్టర్‌కు తీర్మానం అందజేశారు. చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డిని ఎన్నుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో ఇప్పటికే కౌన్సిలర్లను తీర్థయాత్రల పేరుతో క్యాంపులకు తరలించారు. కానీ, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలా, వద్దా అనే ఆలోచనలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉన్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ అధిష్టానం మర్రి నిరంజన్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఆదిబట్ల మున్సిపల్ రాజకీయం సరికొత్త మలుపు తిరిగింది.


TELANGANA PRADESH CONGRESS COMMITTEE

Dr. G. Chinna Reddy
Former Minister & Chairman - DAC

SUSPENSION ORDERS - 3-2-2024

The Disciplinary Action Committee of TPCC has suspended Marri Niranjan Reddy, Councillor, from the Indian National Congress party for indulging in anti-party activities, in the Municipal Council, Adibatla of Ranga Reddy district, with immediate effect.

Dr. G. Chinna Reddy

Marri Niranjan Reddy
Councillor
[illegible]
[illegible]
Ranga Reddy district - 500 070

మర్రి నిరంజన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు